క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.40 వేల సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న రిటైర్డ్ సీఐ రమణయ్య

పాతపట్నం: మండల కేంద్రంలోని కేథారేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి పాతపట్నానికి చెందిన రిటైర్డ్ సీఐ బొద్దాన రమణయ్య, కాంతమ్మ దంపతులు రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆలయంలో నీలమణిదుర్గ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అక్కందర సన్యాసరావు చేతుల మీదుగా గురువారం అర్చకులకు రూ.40 వేలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని రమణయ్య తెలిపారు. వార్డు మెంబర్ కిల్లంపల్లి రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సారవకోట: పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించవచ్చునని ఎంఈఓ ఎం.వి.రమణ అన్నారు. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు రావాడ జ్ఞానవి జ్ఞాపకార్థం మండల స్థాయి ప్రతిభ పరీక్షను గురువారంనిర్వహించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి 166 మంది విద్యార్థులు హాజరయ్యారు. పంగ జితేంద్ర, వీరంశెట్టి యజ్ఞశ్రీ, చిన్నాల సాగర్‌సాయి, సాగిపల్లి గణేష్, పాటోజు వర్షిత ఐదు స్థానాల్లో నిల్చారు. వీరికి నిర్వాహకులు రావాడ యోగేశ్వరరావు, రమాదేవి దంపతులు ఎంఈఓ చేతుల మీదుగా ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు, 4వ స్థానంలో నిల్చినవారికి రూ.1500, 5వ స్థానంలో నిల్చిన వారికి రూ.1000 చొప్పున అందజేశారు. మండలంలో ఉన్న ఆరు క్లస్టర్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నీలమణిదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయ ఆవరణలో మంత్ర హోమాలు, నీరాజన మంత్ర పుష్పాలతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. 48వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారికి ఖడ్గ నామాలతో కుంకుమార్చనలు నిర్వహించారు.

మెళియాపుట్టిలో సబ్‌కలెక్టర్ పర్యటన

మెళియాపుట్టి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. కార్యాలయ పనులు వేగవంతం చేయాలన్నారు. త్వరలోనే కార్యాలయం వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కుడ్డబ, చాపర గ్రామాల్లో ల్యాండ్ కన్వర్షన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు, రికార్డులను పరిశీలించారు. వైద్యులు సాయంత్రం 4గంటల వరకు ఉంటారని, రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మందుల నిల్వ, ఆస్పత్రి ప్రాంగణం పరిశుభ్రతను పరిశీలించారు. తహసీల్దార్ సరోజిని, సర్వేయర్ చలపతిరావు, డీటీ శంకర్, ఆర్ఐ వైకుంఠరావు, వీఆర్వోలు ఉన్నారు.

నేడు గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

ఆమదాలవలస రూరల్: మండలంలోని కట్యాచార్యులపేట గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించనున్నారు. ఈ మేరకు సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

శిక్షణతో మెరుగైన ఫలితాలు

జలుమూరు: ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణలతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. కరవంజ ఆదర్శ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయుల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. పాఠశాల నిధులు, ఆడిట్ తదితర విషయాలను వివరించారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ద్విచక్రవాహనం వేలం

కొత్తూరు: ఈ నెల 28న కొత్తూరు సెబ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బైక్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు సెబ్ స్టేషన్ ఎస్ఐ బి.ప్రభాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం కేసులో సీజ్ చేసిన బైక్‌ను వేలం వేస్తామన్నారు. ఉదయం 11 గంటలకు ఆసక్తి ఉన్న వ్యక్తులు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

బీసీ కమిషన్ సభ్యుడి మృతికి సంతాపం

నరసన్నపేట: ఏపీ బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ మృతి బీసీలకు తీరనిలోటని శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ అన్నారు. గురువారం విశాఖలో అంత్యక్రియలు జరిగాయన్నారు. ఈయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పాలనలో జవాబుదారీతనం కోసం గడపగడపకు మన ప్రభుత్వం
- స్పీకర్ తమ్మినేని సీతారాం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, పాలనలో జవాబుదారీతనం కోసం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతీ గ్రామంలో ప్రజల ముంగిటకు వస్తున్నామని ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు పాత ఆమదాలవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా చేరుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. నిరుపేదల గౌరవాన్ని పెంచేలా సీఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోర చిన్నంనాయుడు, పాదిలాపు తిరుపతిరావు, బండి ఎర్రంనాయుడు, మామిడి రమేష్, పొన్నాడ చిన్నారావు, బొడ్డేపల్లి రమణమూర్తి, సాదు చిరంజీవి, సాదు కామేశ్వరరావు, సంపతిరావు రామారావు, బండి వెంకటేష్, బండి హేమసుందర్, బండి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: నియోజకవర్గంలో ప్రధాన మంత్రి అవాస యోజన (పీఎంఏవై) గ్రామీణ పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ డీఈఈ వి.నర్సింగరావు, తహసీల్దార్లతో గురువారం సమీక్ష నిర్వహించారు.

నియోజకవర్గంలో పీఎంఏవై పథకంలో 2,835 ఇళ్లకు మంజూరయ్యాయని, వాటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 138 జగనన్న కాలనీల లేవుట్లలో 3,163 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సమస్యలు లేకుండా చూడాలని తహసీల్దార్లకు ఆదేశించారు. పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల తహసీల్దార్‌లు రవిచంద్ర, సరోజిని, బాల, మురళీమోహన్‌రావు, సత్యనారాయణ, వెంకటరమణ, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

హిరమండలం: మండలంలోని కల్లట కార్మెల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కార్మెల్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు బిష్వజిత్ పాణి, కరస్పాండెంట్ సంజూప్రభాహణి గురువారం అభినందించారు. కళాశాలలో సీనియర్, జూనియర్ విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

సీనియర్ ఇంటర్ బైపీసీలో ఎస్.చంద్రసాహితి 986 మార్కులు, ఎంపీసీలో కె.లహరి 984 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో పి.సుశీల్ కుమార్ 454 మార్కులు, బైపీసీలో షాలినీ పట్నాయక్ 429 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 64 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 79 మంది ప్రథమ స్థానాల్లో ఫలితాలు సాధించారన్నారు. కళాశాల డైరెక్టర్ రంజితకుమార్ పాయక్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలువ పరిశీలన



ఓనిగడ్డను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు, చిరంజీవి నాగ్

బూర్జ: మండలంలోని 17 గ్రామాలకు సాగునీటి ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో 1957లో నిర్మించిన ఓనిగడ్డ కెనాల్ ద్వారా రానున్న ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పొన్నాడ సుధాకర్‌కు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ కోరారు. ఓనిగెడ్డ కాలువను అధికారులు, మండల నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. చిరంజీవినాగ్ మాట్లాడుతూ ఓనిగెడ్డలో నీటి నిల్వల కెపాసిటీ క్రమేపీ తగ్గుముఖం పట్టడంలో సాంకేతిక పరమైన కారణాలు అన్వేషించాలన్నారు. ఈ కాలువ ఆధునీకీకరణ పనులు కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి స్పీకర్ తమ్మినేని సీతారాం తీసుకెళ్లారన్నారు. ఆధునికీకరణ పనుల కోసం రూ.12.50 కోట్లు అవసరమని అధికారులు గతంలోనే వేసిన అంచనాలు వేశారన్నారు. గత ప్రభుత్వంలో పనులు చేపట్టకపోవడంతోనే కాలువ ద్వారా నీటి ప్రవాహానికి అవరోధాలు ఏర్పడ్డాయన్నారు. కనీసం జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టకపోవడంతో 22 కిలో మీటర్ల మేర జంగిల్ ఏర్పడి కాలువ మునుపటి వైభవం కోల్పోయిందన్నారు. ఉపాధి పనులు చేపట్టి జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబుకి సూచించారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తిచేయాలి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనులు జూన్ ఆఖరు నాటికి పూర్తిచేయాలని ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని రోటరీనగర్ పాఠశాలలో గురువారం నాడు-నేడు పాఠశాలల హెచ్ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో విడతలో చేపట్టిన పనులు వేగవంతం చేయాలన్నారు. పనులు పూర్తి చేయటంలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, పెయింటింగ్స్, ఇతర మరమ్మతులు పూర్తిచేసి అప్పగించాలన్నారు. హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

చురుగ్గా నాడు-నేడు పనులు..

నరసన్నపేట: మండలంలోని పలు పాఠశాలల్లో నాడు-నేడు పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఎంఈఓ శాంతారావు అన్నారు. లుకలాం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.14 కోట్లతో 38 స్కూళ్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా స్కూళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. లుకలాం ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రహరీ, తరగతి భవనాలు పనులు నాణ్యతగా చేపట్టాని సూచించారు.

సర్వే శత శాతం పూర్తిచేయాలి

నరసన్నపేట: ప్రజల రోగాలకు సంబంధించి నిర్వహిస్తున్న సంక్రమిక, అసంక్రమిక సర్వే శత శాతం పూర్తిచేయాలని అదనపు డీఎంహెచ్ఓ ఎస్.అనురాధ పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచించారు. ఉర్లాం పీహెచ్‌సీని గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్వే వివరాలను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. 87 శాతం మేరకు సర్వే చేశామని విస్తరణాధికారి జీవీ రమణ తెలిపారు. పలువురు వలసల్లో ఉండటంతో ఆయా కుటుంబాల సర్వే చేయలేక పోయామని సిబ్బంది తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. డీపీఎంఓ వాన సురేష్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి

జలుమూరు: ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేసి కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఉభయ కమ్యూనిస్టు నాయకులు అన్నారు. జలుమూరు, చల్లవానిపేటలో గురువారం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించి, సీపీఐ జిల్లా నాయకులు సనపల నరసింహులు మాట్లాడారు. దేశంలో అంబానీ, అదానీలను మోదీ పెంచి పోషిస్తున్నాడని, ఇలాంటి తరుణంలో దేశాన్ని రక్షించుకునేందుకు అందరూ ముందుకు రావాలన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్



సారవకోట: కూర్మనాథపురంలో స్టిక్కర్లు అతికిస్తున్న ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పారదర్శకంగా పథకాలను అమలు చేసి ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలిపాలని కోరారు. ఇంటి యజమానుల అనుమతిలో జగనన్న స్టిక్కర్లను గోడలకు అతికించారు. - సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: హిరమండలంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మెళియాపుట్టి: గిరిశిఖర గ్రామం చందనగిరిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: కట్యాచార్యులపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ రామచంద్రరావు



సరుబుజ్జిలి: అమృత లింగానగరంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై నిలదీత



పోలాకి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారుల పనితీరుపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హాజరయ్యారు. అభివృద్ధి పథకాలను స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పనితీరుపై చర్చ జరుగుతున్న సమయంలో మండలంలోని పలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పి మూడేళ్లు అవుతున్నా పనులు పూర్తికాలేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. బద్రిలో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని ఎంపీటీసీ మెండ బాలచంద్రరావు నాయుడు తెలిపారు. నౌతళలో మంచినీటి పథకం ఏర్పాటుకు కోసం తవ్వకాలు చేపట్టి పనులు పూర్తి చేయలేదని సర్పంచ్ పల్లి శ్రీహరి ఆరోపించారు. అన్నుపురంలో కుళాయిల పలు వీధులకు నీరు రావడం లేదని ఎంపీటీసీ ఎడ్ల అసిరయ్య అన్నారు. అక్కివలస గ్రామానికి 108 వాహనం రాకుండా గుమ్మపాడు గ్రామానికి వెళ్తుందని సర్పంచ్ బమ్మిడి లక్ష్మి సభ దృష్టికి తీసుకొచ్చారు. 2006 నుంచి వివిధ ప్రభుత్వాల హయాంలో మంజూరైన ఇళ్లకు జియో టాగింగ్ చేస్తున్నామని, సభ్యులు సహకరించాలని గృహ నిర్మాణశాఖ ఏఈ ప్రసాదరావు కోరారు. మండల ప్రత్యేకాధికారి వి.జయరాజ్, తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం..

పోలాకి: క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఉపాధి పనులు నిర్వహణ తీరుపై ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలాకి మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధి పనులపై పర్యవేక్షణ పెంచాలని అధికారులకు సూచించారు. ఏపీఓ రమణ ఉపాధి పనుల వివరాలు తెలియజేస్తున్న సమయంలో సభ్యుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. ఫీల్డ్ అసిస్టెంట్‌లు తప్పుడు మస్తర్లు వేస్తున్నారని సభదృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల పోలాకి పంచాయతీలో చేపట్టిన ఉపాధి పనుల్లో 70 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన విషయంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కలుగజేసుకున్నారు. ఏపీఓ, ఇతర సిబ్బందిని మందలించారు. ప్రభుత్వం వేతనదారులకు అందజేస్తున్న నిధులను దుర్వినియోగం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మండల స్థాయిలో ఉపాధి సిబ్బందితో సమీక్ష ఏర్పాటుచేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. పంచాయతీరాజ్ డీఈ, సభ్యుల మధ్య అభివృద్ధి పనులను రికార్డ్ చేయటంలో జాప్యంపై వాగ్వివాదం జరిగింది. ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, ఎంపీడీఓ ఈశ్వరరావు, డీటీ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశుసంపద కాపాడుకోవాలి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



దూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ సౌజన్యంతో జిల్లా అధికారులు ఏర్పాటుచేసిన లేగదూడల ప్రదర్శనను ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద లక్ష్మీపురంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరయ్యారు. ప్రదర్శనలో ప్రథమ బహుమతి జగన్నాథపురం గ్రామానికి చెందిన రైతు అల్యాన అప్పలస్వామి, ద్వితీయ బహుమతి బైపోతు జడ్డన్నకు బహుమతుల ప్రదానం చేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ రైతు పశుసంపదను కాపాడుకోవాలన్నారు. పశుసంపద ఉన్న ఇంటిలో సిరి ఉంటుందని పెద్దలు చెప్పారన్నారన్నారు. రాష్ట్రీయ గోకుల మిషన్‌లో భాగంగా దూడల పథకంపై అవగాహన రైతులకు కల్పించారు. పశుసంవర్ధకశాఖ జేడీ శివ్వాల మన్మధరావు మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు పాడి పశుసంపదను బాధ్యతగా చూసుకుంటే అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. జిల్లాలో 2.27 లక్షల కృత్రిమ గర్భాధారణ టీకాలు వేసినట్లు తెలిపారు. ఏడీ మంచు కరుణాకరరావు, పలువురు డాక్టర్లు, ఎంపీడీఓ చంద్రకుమారి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, సర్పంచ్ బైపోతు ఉదయ్‌కుమార్, మండల నాయకులు జయమునిరావు, పల్లి యోగి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై సర్వే



జంగాలపాడు పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న అధికారులు

బూర్జ: మండలంలోని జంగాలపాడు, బొడ్డపాడు, గోపిదేవిపేట గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు గురువారం సర్వే నిర్వహించారు. సీతంపేట ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ఈ సర్వే చేపట్టారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, అంగన్‌వాడీ, పాఠశాలల నిర్వహణ, హౌసింగ్, విద్య, వైద్యం తదితర వాటిపై సర్వే చేసి నివేదికలు తయారుచేశారు. జంగాలపాడు ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్య గుర్తించారు. మధ్యాహ్న భోజనం సమయంలో అన్నం, సాంబారు, టమాటా పచ్చడి ఇవ్వడంతో గమనించి విద్యార్థులకు అధికారులు స్వయంగా వడ్డించి మెనూ విధిగా అమలు చేయాలని సూచించారు. హౌసింగ్ ఏఈ రమణమూర్తి, మండల ఇంజినీరింగ్ అధికారి మౌనిక, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారికి సన్మానం



జయరాజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండల ప్రత్యేకాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న పశు సంవర్ధకశాఖ డీడీ వి.జయరాజ్‌ను మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు గురువారం సన్మానించారు. ఈయన పశుసంవర్ధకశాఖలో రాష్ట్ర స్థాయిలో బెస్ట్ డివిజనల్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎంపిక అయ్యారు. ఈ నెల 29న ప్రపంచ పశు వైద్య దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలో అవార్డు అందుకోనున్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న 45 డివిజన్లలో టెక్కలి డివిజన్ నుంచి జయరాజ్ ఎంపిక కావడం విశేషమని ఎమ్మెల్యే అన్నారు. తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సాగునీరు అందించేందుకు చర్యలు

జలుమూరు: రామచంద్రాపురం ఎత్తిపోతల పథకం నుంచి జోనంకి పంచాయతీకి సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈఈ ఎం.కామరాజు అన్నారు. రామచంద్రాపురం ఎత్తిపోతల పథకాన్ని గురువారం పరిశీలించారు. ఇక్కడ ఉన్న మోటార్లు, పంపులు వేరుచేస్తామన్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చొరవతో అవసరమైన నిధులు వెచ్చిస్తామన్నారు. ఏఓ బి.అనిల్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, గ్రామ పెద్ద జి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట గ్రామం సమీపంలో ఉన్న తురకవాని చెరువులో గుర్రపుడెక్కను తొలగింపు పనులు గురువారం చేపట్టామని ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి తెలిపారు. తురకవాని చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోవడటంతో సాగునీటికి, గ్రామ అవసరాలకు చెరువుకు వెళ్లేందుకు రైతులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారని గ్రామ సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. సర్పంచ్ అభ్యర్థన మేరకు గుర్రంపుడెక్క తొలగింపు పనులు చేపట్టామన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం

జలుమూరు: వడదెబ్బ తగలకుండా ప్రజలు, ఉపాధి వేతనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు ఆరోగ్యశాఖ అధికారి అనురాధ అన్నారు. సైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఎండ వేడిమి, వడదెబ్బపై అవగాహన కల్పించి, వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. వేసవిలో మంచినీరు, కొబ్బరినీరు, బార్లీ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు తీసుకోవాలన్నారు. చల్లగా, వదులుగా ఉండే తెల్లని కాటన్ దుస్తులు ధరించాలన్నారు. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్యాధికారులు గురునాథరావు, వైష్ణవి, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పొందూరు: ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు విధిగా తనిఖీలు చేయాలని పొందూరు సీడీపీఓ పాపినాయుడు తెలిపారు. బాలల హక్కుల కమిషన్ సభ్యుల ఆదేశాలు మేరకు కింతలిలో 1, 3 అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. గత ఆరు నెలలుగా సూపర్‌వైజర్ కింతలి కేంద్రాలను విజిట్ చేయలేదన్నారు. ఒకటో కేంద్రంలో ఇద్దరు పిల్లలు రానప్పటికీ వారికి అటెండెన్స్ వేస్తున్న విషయాన్ని గుర్తించామని చెప్పారు. ఇరుకు గదుల్లో కేంద్రాల నిర్వహణపై మండిపడ్డారు. వేరొక చోట అద్దెకు తీసుకోవాలని సూచించారు. ఆయా కేంద్రాల సిబ్బందికి, సూపర్‌వైజర్‌కు మెమోలు జారీ చేస్తున్నామని తెలిపారు. సర్పంచ్ పైడి రాంప్రసాద్ ఉన్నారు.